క్లుప్తంగా

నూకాలమ్మ ఆలయంలో చండీహోమం



నూకాలమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని నూకాలమ్మ ఆలయంలో 58వ చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ రాజాన సత్య నారాయణతో కూడిన ఆలయ కమిటీ పర్యవేక్షణలో ఆర్చకులు మనోజ్‌శర్మ, వేదపండితులు హోమ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు దంపతులు ఉభయ దారులుగా వ్యవహరించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఈమని శశికుమార్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, శ్రీ నూకాంబిక సేవా బృందం సభ్యులు, ఆలయ మేనేజర్ చిటికెన రాంబాబు, భక్తులు పాల్గొన్నారు.

హనుమద్ జయంతి ఉత్సవాలు



ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

పోలవరం రూరల్: హనుమద్ జయంతి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గూటాల, పోలవరం గ్రామాల్లోని ఆంజనేయస్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీగణపతి హోమం, తమల పాకులు, సింధూరం, పంచామృతాలతో అభిషేకాలు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు సామూహిక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గూటాల ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి వారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు.

విశ్వేశ్వరుడికి రుద్రాభిషేకం



అన్నపూర్ణా విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి

టి.నరసాపురం: టి.నరసాపురంలోని అన్నపూర్ణా విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి వారికి శివుడి జన్మనక్షత్రం ఆరుద్ర పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకం నిర్వహించి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో శివయ్యను దర్శించుకుని తరించారు.

మాజీ ఎంపీపీ గంగ పెద్దిరాజు మృతి



గంగ పెద్దిరాజు (ఫైల్)

జంగారెడ్డిగూడెం రూరల్: వేగవరం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ మల్లాబత్తుల గంగ పెద్దిరాజు(68) అనారోగ్యంతో విజయవాడలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ వింగ్ జిల్లా కార్యదర్శి కఠారి సీతారాంబాబు, రాజకీయ పార్టీల నాయకులు, సర్పంచ్‌లు వేగవరంలో పెద్దిరాజు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. గంగ పెద్దిరాజు కుమారుడు వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణ చైతన్యలను రాజకీయ పార్టీల నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కుష్టు వ్యాధిపై అపోహలను విడనాడాలి



రామానుజపురంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం బుధవారం రామానుజపురం గ్రామంలో నిర్వహించారు. బయ్యనగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కుష్టు వ్యాధి లక్షణాలు గుర్తించే విధానం, తీసుకునే చికిత్స అంశాల గురించి అవగాహన కల్పించారు. కుష్టు వ్యాధి పట్ల ఉన్న అపోహలను విడనాడాలని ప్రజలకు సూచించారు. వ్యాధి తీవ్రతను గుర్తించి సకాలంలో వైద్యం తీసుకుంటే కుష్టును నిర్మూలించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎల్.సుబ్రహ్మణ్యం, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్‌కే చాన్ బాషా, బి.సోమలమ్మ, బి.యువరాజు, కె.స్రవంతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

30న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కామవరపుకోట: ఈ నెల 30న మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కంతేటి శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ మేడవరపు వెంకట సత్య విజయలక్ష్మి అధ్యక్షతన ఈ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని, మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు

జంగారెడ్డిగూడెం: యువత అభివృద్ధిని దృష్టిలో ఉంచుకని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమమే ఆడుదాం ఆంధ్ర అని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్ అన్నారు. జంగారెడ్డిగూడెం టౌన్‌హాల్‌లో బ్యాడ్మింటిన్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించాలి, క్రీడల్లో ఆసక్తి ఉన్న వారిని గుర్తించి నాణ్యమైన క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యువత ఉన్నతి కోసం కృషిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నేకూరి కిషోర్, సొసైటీ మాజీ డైరెక్టర్ చిప్పాడ వెంకన్న, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: క్రీడలతో శారీరక ధారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసంగా కలుగుతుందని, దీంతో విద్యార్థులు విద్యలో రాణించడానికి కూడా క్రీడలు దోహదపడతాయని జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు బుధవారం బయ్యనగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరుగుతున్న క్రీడలను ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ దివంగత నేత పోతన శేషగిరిరావు జ్ఞాపకార్థం కుమారుడు రాజా గణేష్ రాయుడు రూ.15 వేలతో సమకూర్చిన దుస్తులు, క్రీడా సామగ్రిని క్రీడాకారులకు సర్పంచ్ లింగిశెట్టి అనంతలక్ష్మితో కలిసి పంపిణీ చేశారు. మండల, జిల్లా స్థాయి పోటీలలో అర్హత సాధించిన విద్యార్థులకు, యువతకు తమ వంతు సహకారం అందిస్తామని రాజా గణేష్ రాయుడు పేర్కొన్నారు. లింగిశెట్టి శ్రీనివాసరావు, జొన్నకూటి పట్టియ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.



కొయ్యలగూడెం: బయ్యనగూడెం జెడ్పీ హైస్కూల్లో క్రీడల్లో పాల్గొన్న యువత



జంగారెడ్డిగూడెం: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

క్రీడలను ప్రోత్సహించాలి

కామవరపుకోట: రోగాల బారిన పడకుండా శరీరం ఆరోగ్యం ఉండాలంటే ఆటలు ఎంతో ఉపయోగపడతాయని, ప్రతి ఒక్కరు ఆటలు ఆడాలని కామవరపుకోట సర్పంచ్ కరిపోతు అనూష భాగ్యరాజ్ అన్నారు. బుధవారం మండలంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీలలో పాల్గొన్న, క్రికెట్ క్రీడాకారులకు వ్యాయామ ఉపాధ్యాయులు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజు, ఎంఈఓ డి. సుబ్బారావు, సెక్రటరీ జీడి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ తమ్మిశెట్టి గిరిజ, కో ఆప్షన్ సభ్యులు ఎస్కె కరిముల్లా, మేడంకి విజయ రావు తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు కోలాహలంగా జరుగుతున్నాయి. దేవుపల్లి, లక్కవరం గ్రామాల్లో పాఠశాల క్రీడా మైదానాల్లో ఆటలు పోటీలు జరిగాయి. బుధవారం జరిగిన పోటీల్లో ఎంపీడీవో కె.విజయ్ ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందన్నారు. దేవుపల్లిలో సర్పంచ్ దోరేపల్లి సత్యనారాయణ క్రీడా పోటీలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను నిర్వహిస్తుందన్నారు. మండలంలోని పాఠశాలల్లో క్రీడ పోటీల నిర్వహణ కొనసాగింది.



కామవరపుకోట: క్రికెట్ ఆడి, ఆటను ప్రారంభిస్తున్న సర్పంచ్ అనూష



జంగారెడ్డిగూడెం రూరల్: లక్కవరంలో క్రీడా పోటీలు నిర్వహించిన దృశ్యం



జంగారెడ్డిగూడెం రూరల్: దేవులపల్లిలో పోటీలు ప్రారంభించి క్రీడాకారులకు కరచాలనం చేస్తున్న సర్పంచ్ సత్యనారాయణ



కామవరపుకోట: క్రికెట్ క్రీడాకారులకు సూచనలు ఇస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

నృత్య పోటీల్లో కె.కోట చిన్నారుల ప్రతిభ

కామవరపుకోట: ఇటీవల ఏలూరు వైఎంహెచ్ఏ హాలులో అభినయ నృత్య భారతి అకాడమీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి శాస్త్రీయ నృత్య పోటీల్లో కామవరపుకోటకు చెందిన చిన్నారులు సత్తా చాటారు. స్థానిక స్రవంతి డాన్స్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నృత్య శిక్షణ పొందిన పలువురు చిన్నారులు ఈ పోటీలలో పాల్గొన్నారు. ఆలూరి రేణుకకు సబ్ జూనియర్ విభాగంలో ద్వితీయ స్థానం, తోకల లహరిక, గొర్రెల సౌజన్యలకు తృతీయ స్థానం, యార్లగడ్డ జస్విత ప్రోత్సాహక బహుమతులు గెలుపొందారు. నిర్వాహకులు చిన్నారులకు జ్ఞాపికతో పాటు ప్రశంసాపత్రం అందజేశారు. వీరికి తర్ఫీదునిచ్చిన స్రవంతి టీచర్‌ను, చిన్నారులను షేక్ ఇబ్రహీం, తోకల రాజేష్, ఆలూరి మురళి, గోద్రెజ్ రాంబాబు, గ్రామస్తులు అభినందించారు.



ఏలూరులో వైఎంహెచ్ఏ హాల్‌లో జ్ఞాపికలు అందుకుంటున్న కె.కోట చిన్నారులు

ధర్మాన్ని ఆచరించేవారు దైవంతో సమానం

కొయ్యలగూడెం: ధర్మాన్ని ఏ జీవి ఆచరించినా, ఏ రూపంలోని వారు అవలంభించినా వారు దైవంతో సమానులని శ్రవణ చైతన్యానంద చిన్నస్వామి ఉపదేశించారు. హనుమద్ వ్రత ఉత్సవాలలో భాగంగా సరిపల్లి, బయ్యన్నగూడెం గ్రామాల మధ్య స్వయంభు శ్రీ సంజీవ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆయన బుధవారం భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల శ్రీ సమతానంద దుర్గా మహాపీఠ అధిపతి చైతన్యానంద చిన్నస్వామి మాట్లాడుతూ ధర్మాన్ని ఆచరించాడు కాబట్టే రాముడు దేవుడు అయ్యాడని మాయోప, తంత్ర, మంత్రాలు వలన కాదు అని అన్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. వేదాలలోని సారాలను ఉపనిషత్తుల గురించి భావితరాలవారికి అందించాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. మరో పదేళ్ల తరువాత ఇప్పుడు ఉన్న స్థితి కంటే హిందూ మతం మరింత ఉత్కృష్టమైన స్థితికి చేరుకుంటుందని అన్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం అన్నసమారాధన, అనంతరం స్వామివారి ఉత్సవ ఊరేగింపు నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.



శ్రవణ చైతన్యానంద స్వామి

క్రీస్తు మార్గం సర్వమానవాళికి ఆచరణీయం

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: ఏసుక్రీస్తు ప్రేమ, మార్గం సమస్త మానవాళికి ఆచరణీయమని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని కేఆర్ పురంలో క్రిస్మస్ వేడుకలు బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవుడు మానవులను ప్రేమించి ఎవ్వరూ నశించిపోవుట ఇష్టంలేక తన కుమారుడైన ఏసుక్రీస్తును ఈ లోకానికి రక్షకుడిగా పంపాడని అన్నారు. ఆయన ప్రేమను అందరూ గుర్తించి క్రీస్తు వలే ఇతరులను ప్రేమించాలని చెప్పారు. కార్యక్రమంలో చిన్నారులు ఆలపించిన క్రైస్తవ గీతాలు, నృత్యాలు, క్రీస్తు పుట్టుక నాటికలు ఆకట్టుకున్నాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, ఎస్పై వెంకన్న, సంఘ పెద్దలు పాల్గొన్నారు.



కేఆర్‌పురం క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేసి పిల్లలకు పెడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

వామనావతారంలో జనార్దన స్వామి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని శ్రీ భూ, నీళా సమేత శ్రీ జనార్దన స్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారికి విశేష పూజలు చేశారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, తిరుప్పావై సేవా కాలం నిర్వహించారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలు చేశారు. స్వామివారు శ్రీ వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. ఆలయ అర్చకుడు వంగల పవన్ కుమార్ విశేష పూజలు నిర్వహించగా, కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్లరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



వామనావతారంలో జనార్దన స్వామివారు

నేటి నుంచి సప్తాహాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం నుంచి స్వామివారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు ప్రారంభవుతాయని దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ తోలేటి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం దేవస్థానంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 5వ తేదీన లక్ష కుంకుమార్చన, 7న శ్రీ సుదర్శన హోమం, 9న స్వామివారికి నవనీత అలంకరణ, 13న లక్ష తులసి పూజ, 14న గోదా కళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 29న ప్రముఖ ఆధ్యాత్మిక ప్రసంగీకులు చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈవో నాగం సన్యాసిరావు మాట్లాడుతూ దాతలు సమర్పించిన బంగారంతో స్వామివారికి స్వర్ణ శంఖు చక్రాలు చేయించేందుకు టీటీడీ అధికారులతో సంప్రదింపులు చేస్తున్నామన్నారు. ఉత్సవాలు జనవరి 17వ తేదీతో ముగుస్తాయని, 20న భారీ అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిళాంబి మారుతి శ్రీనివాస రామానుజాచార్యులు, దేవస్థానం ట్రస్టీలు కిలారపు శ్రీనివాసరావు, బోడే శివసాయి కృష్ణ పాల్గొన్నారు.

రామచంద్రరావుకు సత్కారం



రామచంద్రరావును అభినందిస్తున్న జేసీ లావణ్యవేణి

జంగారెడ్డిగూడెం: జాతీయ వినియోగదారుల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం మండల వినియోగదారుల కౌన్సిల్ అధ్యక్షుడు, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ కుకునూరి రామచంద్రరావుకు అభినందన సత్కారం లభించింది. ఏలూరు జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ సివిల్ సప్లయిస్ అధికారి సత్యనారాయణరాజు అధ్యక్షతన కలెక్టరేట్‌లో ముగింపు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జాయింట్ కలెక్టర్ లావణ్య వేణి చేతుల మీదుగా రామచంద్రరావు సత్కారం అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల స్థాయి, జిల్లా స్థాయిలో వినియోగదారుల చైతన్యానికి కృషి చేస్తున్నందుకు తనకు ఈ సత్కారం లభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, వినియోగదారుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రగ్గుల పంపిణీ



రగ్గులు పంపిణీ చేసిన దృశ్యం

టి.నరసాపురం: క్రిస్మస్ ఆనందం పేరుతో బొర్రంపాలెం గ్రామంలో బుధవారం రగ్గుల పంపిణీ నిర్వహించారు. గ్రామానికి చెందిన కలపర్తి విజయ్, ఫర్ ద పీపుల్ యూత్ ఆధ్వర్యంలో రగ్గుల పంపిణీని కార్యక్రమాన్ని గత మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది పేదలకు, వృద్ధులకు సుమారు రూ.30 వేల విలువైన రగ్గులు, పండు, చాక్లెట్లు 70 మందికి అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో గుట్ల సురేష్, అశోక్, మోసే, నాగేంద్ర, నరేష్, శరత్, సర్వేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గ అమ్మవారికి పల్లకీ సేవ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని విజయదుర్గ అమ్మవారి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారికి పల్లకీసేవ నిర్వహించారు. శాశ్వత కమిటీ అధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు సుదర్శనం వేణుగోపాలాచార్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జంగారెడ్డిగూడెం పురవీధులలో అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో శాశ్వత కమిటీ కార్యదర్శి మాడా రామ మోహన్‌రావు, సహాయ కార్యదర్శి రామిశెట్టి శ్రీనివాసరావు, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుడిమెట్ల యుగంధర్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యర్రం ఉదయ్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ విద్యుత్ కనెక్షన్లు తొలగించాలి

జంగారెడ్డిగూడెం: ఎర్రకాలువ ప్రాజెక్ట్ మిగులు భూముల్లో అక్రమ విద్యుత్తు కనెక్షన్లు తొలగించాలని సీపీఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం విద్యుత్ ఈఈ పి.రాధాకృష్ణకు వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకరరావు, మండల కార్యదర్శి ఎంజీవరత్నం మాట్లాడుతూ కేతవరం గ్రామంలో అక్రమ పద్ధతిలో 36 కరెంటు కనెక్షన్లతో వ్యవసాయాలు చేస్తున్నారని, తక్షణమే కనెక్షన్లు తొలగించాలని విద్యుత్ ఈఈ రాధాకృష్ణను కోరారు. దీనిపై ఈఈ స్పందిస్తూ తక్షణమే సమగ్ర దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సీపీఎం నాయకులు తెలిపారు.

ఆయుష్ ఆస్పత్రిలో ఘటనపై విచారణ చేయించాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు ఆయుష్ ఆస్పత్రిలో జరిగిన అరాచకం, అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేయించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటనలో కోరారు. చనిపోయిన మహిళకు మూడు రోజులు వైద్యం చేస్తున్నామని నమ్మబలికి లక్షలు దోచుకోవడం బాధాకరమని పేర్కొన్నారు. అసమర్థ వైద్యులను పెట్టి చికిత్స చేస్తూ ప్రజల ప్రాణాల మీదకు తెస్తున్న ఇలాంటి ఆసుపత్రుల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఆస్పత్రికి అనుమతులు ఉన్నాయా, అనధికారంగా నిర్వహిస్తున్నారా అనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ఆయుష్ ఆస్పత్రిపై చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని రవి కోరారు.

నేత్రపర్వంగా శ్రీవారి తిరువీధి సేవ

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో స్వామి వారి తిరువీధి సేవ బుధవారం ఉదయం నేత్రపర్వంగా జరిగింది. ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని స్వామి వారికి జరిగిన ఈ వేడుక భక్తులకు కనువిందు చేసింది. ముందుగా ఆలయంలో అర్చకులు స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి ప్రత్యేక అలంకరణలు చేశారు. అనంతరం పూజాదికాలు జరిపి హారతులు ఇచ్చారు. ఆ తర్వాత మేళ తాళాలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకులు, వేద పండితులు వేద మంత్రోచ్చరణ నడుమ గజ సేవతో స్వామి వారి వాహనం ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. ప్రతి ఇంటి ముంగిట స్వామి అమ్మవార్లకు భక్తులు నీరాజనాలు సమర్పించారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా రాత్రి సైతం స్వామి వారికి తిరువీధి సేవ వైభవంగా జరిగింది.



క్షేత్ర పురవీధుల్లో వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు, గోదాదేవి

పారిజాతగిరిలో హుండీ లెక్కింపు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా ఆలయంలో ఉదయం 5 గంటలకు గోదాదేవి తిరుప్పావై ప్రవచనం అత్యంత వైభవంగా ఆలయ అర్చకుడు నల్లూరి రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం హుండీ లెక్కింపు నిర్వహించారు. 92 రోజులకు రూ.13,00,478 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో మానికల రాంబాబు తెలిపారు.



హుండీ సొమ్ము లెక్కింపు నిర్వహిస్తున్న దృశ్యం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేవదాయ - ధర్మదాయ శాఖ
శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానం, బుట్టాయిగూడెం రోడ్, జంగారెడ్డిగూడెం

షాపులు లైసెన్సునకు టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన

ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం, జంగారెడ్డిగూడెం నగర పంచాయితీలో గల శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానం తాలూకు ఈ దిగువ పట్టికలో తెలుపబడిన షాపులకు 3 సంవత్సరములు కాలమునకు లనగా అప్పగించిన నాటి నుండి వ్యాపారం చేసుకొనుటకు లైసెన్సు హక్కుగాను ది.11-01-2024 ఉదయం 11 గంటల నుండి పట్టికలోని 1వ నెంబరు షాపు నుండి 10వ నెంబరు షాపులు మరియు 12వ నెంబరు గల షాపులు సదరు దేవదాయ - ధర్మదాయశాఖ అధికారుల సమక్షమున బహిరంగ వేలం పాట జరుపబడును. కావున ఆసక్తి గలవారు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాము.

వ.నెం.	సర్వే నెం.	విస్తీర్ణం	షాపు నెం	చెల్లించవలసిన ప్రధమ ధరావత్తు సొమ్ము	వేలంపాట జరుగు ప్రదేశం మరియు తేది	షాపు కాలపరిమితి
2	450/5, యు॥1.76 సెం॥ మదర్ థెరిస్సా సెంటర్ అశ్వారావుపేట రోడ్, జంగారెడ్డిగూడెం	12 x 34 10 x 45 14 x 45 14 x 45 8.9 x 20 8.9 x 20 8.9 x 20 8.9 x 20 8.6 x 11 10 x 11 10 x 12	1 2 3 4 5 6 7 8 9 10 12	రూ.5,000/-	స్వయంభు శ్రీమద్ది ఆంజనేయ స్వామి వారి దేవస్థానం ప్రాంగణం, 11-01-2024 ఉ॥ 11గం.ల నుండి	అప్పగించిన నాటి నుండి 3సంవత్సరములు కాలపరిమితి

పాటషరతులు: 1) ఈ వేలం జి.ఓ.యం.ఎస్.నెం.866 రెవెన్యూ (ఎండోమెంట్స్-1) డిపార్టుమెంట్ తేది.08.08.2023 మరియు జి.ఓ.యం.ఎస్.నెం.426 రెవెన్యూ (ఎండోమెంట్స్-1) తేది. 09.11.2015ను అనుసరించి హిందు దేవదాయ-ధర్మదాయశాఖ, అధికారుల ఆమోదపు ఉత్తర్వులకు లోబడి కార్యనిర్వహణాధికారిచే జరుపబడును. దేవాదాయ ధర్మదాయశాఖ హిందు సంస్థ అయినందున హిందువులు మాత్రమే పాటలో పాల్గొనుటకు అర్హులు. 2) టెండరు షెడ్యూలు ధర రూ.250/-లు ది.09-01-2024 తేది నుండి ది.10-01-2024 తేది వరకు దేవాలయం వద్ద విక్రయించబడును. పూర్తి చేసిన టెండరును సీల్డు కవరులో ది.11-01-2024 తేదిన ఉదయం గం.09-00ల నుండి గం.10-00ల వరకు స్వీకరించబడును. జంగారెడ్డిగూడెం గ్రూపు దేవాలయము దగ్గర షెడ్యూలు ఇవ్వబడును.

జంగారెడ్డిగూడెం
తేది: 27.12.2023

ఆకుల కొండలరావు MA
కార్యనిర్వహణాధికారి,
సెల్: 9908450979

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పోలవరం డివిజన్
9951602915 (పోలవరం)
9505508399 (చింతలపూడి)
Office mail : tpgadvt@gmail.com